క్లుప్తంగా

కంపచెట్ల తొలగింపు



శ్రమదానం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని 19వ వార్డు పరిధి సోమిశెట్టి నగర్‌లో పబ్లిక్ కుళాయిల దగ్గర పెరిగిన కంపచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సీపీఎం నాయకులు ఆర్.నరసింహులు, బి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం చేపట్టి కంపచెట్లను తొలగించారు. భవిష్యత్‌లో కంపచెట్లు పెరగకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.

రామాలయ శతాబ్ది ఉత్సవాలు



బ్రహ్మోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: కర్నూలు వన్‌టౌన్ మెయిన్ బజార్‌లోని పేట శ్రీరాముల ఆలయం శతాబ్ది ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆషాఢ శుక్ల నవమి పురస్కరించుకొని ఆలయ ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. సీతారాముల వారికి ఊంజల్ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమై వందేళ్లైన తరుణంలో శతాబ్ది ఉత్సవాల స్టిక్కర్లను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షులు చిలుకూరు ప్రభాకర్, అఖిల భారత కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, ప్రధాన అర్చకులు మాళిగి హనుమేష్ ప్రసంగించారు. శ్రీరామావధూత భజన బృందం, శ్రీ సూర్యకళ కల్చరల్ అకాడమీ వారు భక్తి సంగీత విభావరి నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ద్వారకానాథ్, విఠల్ శెట్టి, మహేష్, వ్యాసరాజ్, భాను ప్రకాష్, శ్రీహరి, ఉయద్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ



మంత్రి టీజీ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్‌ను నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ బిందు మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సంకల్‌బాగ్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతల పరిరక్షణ, అభివృద్ధి అంశాలపై ఇరువురూ చర్చించారు.

ముగిసిన వారాహి పూజలు



కుంకుమార్చనలో అమ్మవారు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయం అవరణలోని మహాగౌరీ ఆలయంలో నిర్వహిస్తున్న ఆషాఢ మాసం వారాహీ నవరాత్రుల పూజలు మంగళవారం ముగిశాయి. మహా గౌరీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గణపతి పూజ, మండపారాధన, లలితా సహస్రనామార్చనలు, సామూహిక కుంకుమార్చనలు, వారాహీ సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్ఏబీఎల్ బృందం పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని వ్యవసాయ శాఖ పురుగు మందుల నాణ్యత ప్రమాణాల పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఇద్దరు సభ్యులు కలిగిన ప్రత్యేక బృందం తనిఖీ చేసింది. కర్నూలు ఏడీఏ కార్యాలయం ప్రాంగణంలోని ల్యాబ్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బ్యూరో ఆఫ్ ల్యాబొరేటరీ (ఎన్ఏబీఎల్) గుర్తింపు కోసం ముందస్తుగా ఈ బృందం పరిశీలించింది. ఎన్ఏబీఎల్ బృందంలో చెన్నై ప్రాంతీయ కార్యాలయం పీపీఓ కెమికల్స్ వెంకటేశ్వర్లు, ఏపీపీఓ కెమికల్స్ టివి మాథ్యూ ఉన్నారు. ఎన్ఏబీఎల్ సర్టిఫికేషన్ లభించాలంటే ల్యాబ్ ఎలా ఉండాలి, మౌలిక సదుపాయాల కల్పన, ఎక్విప్‌మెంటు నాణ్యత ప్రమాణాలు, పరీక్షల్లో నాణ్యత తదితర వాటిపై బృందం సభ్యులు సూచనలు ఇచ్చారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ల్యాబ్ తీర్చిదిద్దిన తర్వాత ఎన్ఏబీఎల్ నుంచి ప్రత్యేక బృందం వస్తుంది. ల్యాబ్ పని తీరుపై సంతృప్తి చెందితే ఎన్ఏబీఎల్ గుర్తింపునిస్తూ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. దీంతో ల్యాబ్‌కు జాతీయ స్థాయి గుర్తింపు వస్తుందని, పరీక్షల్లో నాణ్యత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ల్యాబ్ ఏడీఏ నాగసులోచన, ఏఓలు లలిత, షర్మిల, ప్రేమలత తదితరులు ల్యాబ్ గురించి ప్రత్యేక బృందానికి వివరించారు.

టీడీపీ అండతో రెచ్చిపోతున్న జేబుదొంగలు

- పోలీసుల అదుపులో జేబుదొంగల ముఠా నాయకుడు
- గంట వ్యవధిలోనే విడిపించుకెళ్లిన 'చౌదరి'
- మొబైల్ దొంగలపై కొరవడిన నిఘా

కర్నూలు: అధికార పార్టీ నాయకుల అండతో కర్నూలు నగరంలో జేబు దొంగలు రెచ్చిపోతున్నారు. ఆటోల్లో సంచరిస్తూ చేతివాటం ప్రదర్శించి సెల్‌ఫోన్లు, పర్సులు, వస్తువులు, గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. చోరీలపై రెండు రోజుల వ్యవధిలో ఎనిమిది మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ స్థితిలో నాల్గవ పట్టణ పోలీసులు జేబుదొంగల ముఠా నాయకుడు ముజఫర్ నగర్‌కు చెందిన జుబేర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న కల్లూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చౌదరి నేరుగా స్టేషన్‌కు వెళ్లి పోలీసులపై ఒత్తిడి తెచ్చి గంట వ్యవధిలోని విడిపించుకుని వెళ్లారు. దొంగ అయినంతమాత్రాన అరెస్టు చేస్తారా.. మీరేమైనా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారా? ప్రభుత్వం మాది.. అతడు మా పార్టీ కార్యకర్త. గత ఎన్నికల్లో అభ్యర్థి కోసం పనిచేశాడు. అలాంటి యువకుడిని ఎలా అరెస్టు చేస్తారంటూ పోలీసులపై ఒత్తిడి చేసి విడిపించుకెళ్లగా సాయంత్రం మళ్లీ స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. పది మంది జేబు దొంగలకు జుబేర్ ముఠా నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు.

అన్న అనుచరులుగా చెప్పుకుంటూ...

నగరంలోని ముజఫర్ నగర్, శరీన్ నగర్, వీకర్ సెక్షన్ కాలనీ ప్రాంతాల్లో పాత నేరస్తులు, జేబు దొంగలు ఎక్కువగా ఉంటున్నారు. ఆయా కాలనీల్లో మూడు ముఠాలు కొత్త బస్టాండ్‌ను ఆధారంగా చేసుకుని చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బస్టాండ్‌కు ఎదురుగా వ్యవసాయ మార్కెట్ ఉండటంతో రైతులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు రోజూ కర్నూలుకు వస్తుంటారు. డబ్బులు వారి చేతికి అందేవరకు ఈ ముఠా సభ్యులు నిఘా వేసి అనుసరించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. క్రైం పార్టీలో పనిచేసే ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్ కనుసన్నల్లోనే దొంగలు తమ పని కానిస్తున్నట్లు సహోద్యోగుల్లోనే చర్చ జరుగుతోంది. రైతులు దిగుబడులను అమ్ముకుని డబ్బులతో ఆటో ఎక్కినప్పుడు వీరు అదే ఆటోలో ప్రయాణికుల వలే ఎక్కి చేతివాటం ప్రదర్శించి పరారవుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో ఎనిమిది మంది బాధితులు ఇలా డబ్బులు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించారు. అయితే బాధితులు ఫిర్యాదు ఇవ్వగానే క్రైం పార్టీ పోలీసులు ఫోన్ ద్వారా దొంగలకు సమాచారం ఇచ్చి పిలిపించి నొక్కేసిన దాంట్లో కొంత వెనక్కు ఇప్పించి కేసులు నమోదు కాకుండా రాజీ చేస్తున్నట్లు కూడా చర్చ జరుగుతోంది. కొత్తబస్టాండ్ సమీపంలోని అజంతా హోటల్‌ను అడ్డాగా చేసుకుని కొందరు క్రైం పార్టీ పోలీసులు దొంగలతో చేతులు కలిపి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం. జుబేర్ 'అన్న' అనుచరుడిగా చెప్పుకుంటూ కాలనీలో చెలామణి అవుతూ పలువురు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులే అంగీకరిస్తున్నారు. తన ఆటోకు కనీసం ట్రాఫిక్ పోలీసులు కేటాయించే టాప్ నంబర్, రవాణా శాఖ కేటాయించే రిజిస్ట్రేషన్ నంబర్ కూడా లేకుండా తన అనుచరులను వెంటబెట్టుకుని బళ్లారి చౌరస్తా నుంచి పాత ఈద్గా వరకు వెళ్లేలోగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు పోలీసు అధికారులకు కూడా సమాచారం ఉండటంతో విచారించేందుకు అదుపులోకి తీసుకున్నారు. అయితే తెలుగుదేశం నేతలు దొంగలకు అండగా నిలవడంతో ఫిర్యాదుల దర్యాప్తునకు ఆటంకంగా మారినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు.



మొబైల్ దొంగలపై కొరవడిన నిఘా

సెల్‌ఫోన్ చోరీల్లో సిద్ధహస్తులైన పవన్ అలియాస్ బబ్లు, వడ్డె ప్రసాద్ (శ్రీరాం నగర్) బ్యాచ్‌లు జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్ దొంగల ముఠా నాయకులుగా చెలామణి అవుతున్న వీరి కింద కావేటి ఈశ్వరయ్య (లక్ష్మీనగర్), దాస్ (జంపాల శివయ్య నగర్), అఖిల్ (ఎన్‌టీఆర్ బిల్డింగ్స్)తో పాటు మరో ముగ్గురు మైనర్లు ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతుండటంతో రెండేళ్ల క్రితం మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. చోరీ చేసిన వాటిని సెల్‌ఫోన్ మెకానిక్‌లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు అప్పట్లో పోలీసుల దర్యాప్తులో తేలడంతో వారిని జైలుకు పంపారు. అయితే అనతి కాలంలోనే బెయిల్‌పై బయటకు వచ్చి కొంతకాలంగా వృత్తిని కొనసాగిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులున్నా పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కాలిపోయిన నగదు, డాక్యుమెంట్లు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో వడ్డే శ్రీను అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమయ్యింది. వడ్డే శ్రీను, భార్య మహేశ్వరి గుడిసెకు తాళం వేసి పనులకు వెళ్లారు. సాయంత్రం ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. కొద్ది సేపటికి అక్కడికి చేరుకును అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిబూడిద అయ్యాయిని బాధితుడు వాపోయాడు. ప్రమాదంలో దాదాపు రూ. 4 లక్షలు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడని అగ్నిమాపక ఎస్ఐ రామాంజనేయులు చెప్పారు.

స్టాండింగ్ కమిటీకి మోగిన నగారా

- రేపటి నుంచి 24వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 28 వరకు ఉపసంహరణకు గడువు
- వచ్చే నెల 1న పోలింగ్, కౌంటింగ్



కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కమిషనర్ భార్గవ్‌తేజ నోటిఫికేషన్ జారీ చేశారు. 2021 నుంచి ఏడాది ఒకమారు నూతనంగా స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటున్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించారు. గతేడాది మేయర్ చైర్మన్‌గా వ్యవహరించే స్టాండింగ్ కమిటీకి కైప పద్మాలత, జీఎల్‌వీ.సుజాత, సంగాల సుదర్శన్‌రెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, నగరూరు శ్రీనివాస రావు సభ్యులుగా వ్యవహరించారు. ఈనెల 31వ తేదీతో వీరి పదవీకాలం ముగియనుంది. దీంతో కమిషనర్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేయడంతో ఆశావాహులు స్టాండింగ్ కమిటీ ఎన్నికపై దృష్టి సారించారు. ఏడాది పాటు స్టాండింగ్ కమిటీలో కొనసాగే సభ్యులకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు అభివృద్ధి పనులతో పాటు, నగరపాలక చేపట్టే కొన్ని అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తప్పనిసరిగా ఉండాలి.

రేపటి నుంచి నామినేషన్లు

నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 25న నామినేషన్ల పరిశీలన, 28వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఉపసంహరణ గడువు ముగిసిన తరువాత తుది జాబితా ప్రకటిస్తారు. ఆగస్టు 1వ తేదీన నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో పోలింగ్ నిర్వహించడం ఓట్లను లెక్కించడం అదే రోజు ఎన్నికైన సభ్యులను ప్రకటిస్తారు.

మారిన సమీకరణాలతో పోటీ అనివార్యం..?

నగరపాలక సంస్థలో 52 వార్డులు ఉన్నాయి. 42వ వార్డు ఎన్నికను రద్దు చేయడంతో 51 వార్డులకు కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో ఐదుగురికి స్టాండింగ్ కమిటీలో అవకాశం ఉంటుంది. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు మెజార్టీ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండేవారు. దీంతో కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీదే బలం ఉంది. అయితే ఇటీవల రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండిపెండెంట్లతో పాటు పాణ్యం నుంచి ఒకరు, కోడుమూరు నుంచి ఒకరు, కర్నూలు నుంచి అరుగురు తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో 9 మంది ఉన్న తెలుగుదేశం పార్టీకి 17 కు చేరింది. ఈ ఏడాది స్టాండింగ్ కమిటీకి పోటీ పడతారా.. లేదా అన్నది చూడాల్సి ఉంది. పోటీ చేస్తే ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్ పాతబస్తీ నుంచి రంగంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి.

బకాయిలు చెల్లించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ప్రకటనదారులు, ఏజెన్సీల బకాయిలు వెంటనే చెల్లించాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల వ్యవధిలో బకాయిలు చెల్లించాలని, లేని పక్షంలో హోర్డింగ్‌లను తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 14 ఏజెన్సీలు, 8 సినిమా థియేటర్ల నుంచి రూ.1,69,30,196 బకాయిలు రావాల్సి ఉందని వెల్లడించారు.

అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

- నందికొట్కూరు, విజయనగరం, గుంటూరు సంఘటనలే నిదర్శనం
- కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ తీరుపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాలు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, మానభంగాలు, హత్యలను అరికట్టడంలో తెలుగుదేశం ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అరుణమ్మ ధ్వజమెత్తారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నా వాటిని ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. మంగళవారం ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆర్‌వీఎస్, కేవీపీఎస్ నగర కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుపై కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతోనే మహిళలు, చిన్నారులపై దాడులు జరుగుతున్నాయన్నారు. నందికొట్కూరులో 8 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి చంపి కాలువలో పడేశారంటే ఎంతో దౌర్భాగ్యమో అర్థం చేసుకోవచ్చన్నారు. విజయనగరం, గుంటూరు జిల్లాల్లోనూ ఇదే మాదిరిగా మహిళలు, చిన్నారులపై మానవ మృగాలు అకృత్యాలకు పాల్పడ్డాయని, తక్షణమే ఆయా సంఘటనలకు బాధ్యులను గుర్తించి శిక్ష పడేలా చేయాలన్నారు. అశ్లీల వీడియోలను నిషేధించాలని డిమాండ్ చేశారు. వాటిని చూసే చిన్న పిల్లలు సైతం మృగాలుగా మారి అకృత్యాలకు పాల్పడుతున్నారన్నారు. కేవీపీఎస్ నాయకుడు కృష్ణ, రజక సంఘం నాయకుడు శేషాద్రి, డీవైఎఫ్ఐ నాయకుడు హుస్సేన్ బాష, ఎస్ఎఫ్ఐ నాయకులు రంగప్ప, సాయి పాల్గొన్నారు.

దళిత మహిళను హతమార్చడం దారుణం

కర్నూలు కల్చరల్: ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ బసివిని గుండమ్మను అగ్రకులస్తులు ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గొందిపల్లె మాలతి పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని తనతో పాటు మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి రత్నబాయి, బీజేపీ నగర అధ్యక్షుడు జిందే సాయికుమార్‌తో కలిసి పరామర్శించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి బీజేపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నింధితులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌పై ఫిర్యాదు

కర్నూలు (సిటీ): ఏపీఎస్ఆర్టీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌పై రాష్ట్ర హోంమంత్రి వి.అనిత, ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఎండీ, ఈడీ, ఎస్సీ కమిషన్ చైర్మన్లకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు కర్నూలు-2 డిపో మహిళా కండక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాను కండక్టర్‌గా 26 ఏళ్లుగా పనిచేస్తున్నానని, గతేడాది నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు పేర్కొన్నారు. గుండెకు పేస్ మేకర్ సర్జరీ, మూత్రపిండాలకు డయాలసిస్ చేశారని, డ్యూటీ చేయలేక ఈ ఏడాది మార్చి నుంచి సెలవులో ఉన్నట్లు వివరించారు. తిరిగి విధుల్లో చేరేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో ఓడీ (ఆన్‌డ్యూటీ) నిమిత్తం దరఖాస్తు చేసుకోగా డిపో అధికారులు చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కు రెఫర్ చేసినట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ తన దరఖాస్తును తిరస్కరించారని, ఈ విషయంపై ఆయన్ను సంప్రదించగా అవమానకరంగా మాట్లాడారని పేర్కొన్నారు. తనను అగౌరవపరచిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): అనుమతి లేకుండా నిర్వహిస్తున్న డీఎస్సీ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సుంకన్నకు విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన డీఎస్సీ కోచింగ్ సెంటర్లైన అశోక్, టీచర్స్ అకాడమీ, ఆదిత్య, ప్రగతి, విజేత తదితర వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా నిర్వాహకులు కోచింగ్‌కు నిరుద్యోగుల నుంచి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని, ఒక్కో సెంటర్‌లో 500 నుంచి వెయ్యి మంది దాకా అభ్యర్థులను చేర్చుకుంటున్నారన్నారు. ఎలాంటి రసీదు ఇవ్వకుండా కనీస సౌకర్యాలు కల్పించకుండా దోచుకుంటున్నారని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు శరత్, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్‌కుమార్ ఉన్నారు.

ముచ్చుమర్రి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి



కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ముచ్చుమర్రిలో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి ఉదంతంపై సమగ్ర విచారణ జరపాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నిందితులకు లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించి నిజాలు రాబట్టాలన్నారు. మంగళవారం ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాలిక మృతికి సంతాపంగా కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలిక అదృశ్యమై 9 రోజులు అవుతున్నా మృతదేహం ఆచూకీ లేకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాకాంబరీగా లలితా సుందరీమాత



శాకాంబరీగా లలితా సుందరేశ్వరి మాత, వారాహీ మాత, ఆంజనేయస్వామి

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం మంగళవారాన్ని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా సుందరీ మాతకు అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. అభిషేకం, వస్త్ర సమర్పణ, సామూహిక కుంకుమార్చన జరిగాయి. లలితా సుందరేశ్వరిని అన్ని రకాల కూరగాయలతో శాకాంబరీ దేవిగా, అలాగే వారాహీ అమ్మవారిని, పంచముఖ ఆంజనేయ స్వామిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

బీమాతో ధీమా

- రూ.వెయ్యి ప్రీమియంతో రూ.20 లక్షల ఎస్‌బీఐ ప్రమాద బీమా
- ఖతాదారులందరికీ పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలు
- ఎస్‌బీఐ ట్రెజరీ బ్రాంచ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ వెల్లడి



సీవీఆర్ ప్రసాద్

కర్నూలు(అగ్రికల్చర్): భారతీయ స్టేట్ బ్యాంకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని (పీఏఐ) ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు చేపట్టింది. ఎస్‌బీఐలో ఖాతా కలిగిన ప్రతిఒక్కరూ వ్యక్తిగత ప్రమాద బీమాలో చేరే విధంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తుండడం విశేషం. పీఏఐతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలను కూడా ఖాతాదారులందరికీ వర్తింపచేసే విధంగా ఎస్‌బీఐ చర్యలు చేపట్టిందని కలెక్టరేట్‌లోని ట్రెజరీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తెలిపారు. ప్రతి రోజు బ్రాంచికి వచ్చిన ఖాతాదారులందరికీ ఈ బీమా పథకాలపై అవగాహన కల్పించి అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అంతేగాక ఎస్‌బీఐ ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్‌ను కూడా అమలు చేస్తోంది. ఎస్‌బీఐ వ్యక్తిగత ప్రమాద బీమాతో రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బీమా సదుపాయం లభిస్తుందని చీఫ్ మేనేజర్ స్పష్టం చేశారు. ప్రీమియం రూ.100తో రూ.2 లక్షలు, రూ.200తో రూ.4 లక్షల ప్రకారం గరిష్ఠంగా రూ.వెయ్యితో రూ.20 లక్షల వరకు ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకు బీమా చేసుకునేందుకు అవకాశం ఉంది. ఏటా ప్రీమియం చెల్లింపునకు ఆటో డెబిట్ సదుపాయం పెట్టుకోవచ్చని వివరించారు

కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు అమలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలను ఎస్‌బీఐ అమలు చేస్తోంది. సాధారణ మరణాలు, ప్రమాద మరణాలకు ఈ బీమా పథకాలను అమలు చేస్తుండడం విశేషం. పీఎంజేజేబీవై సాధారణ మరణాలకు, పీఎంఎస్‌బీవై కేవలం ప్రమాదాలకు మాత్రమే అమలు చేస్తారు. పీఎంజేజేబీవై కింద 18-50 ఏళ్లలోపు వారు అర్హులు. ఏటా 436 ప్రీమియంతో రూ.2 లక్షలు బీమా పొందవచ్చు. సాధారణ మరణాలకు ఈ బీమా లభిస్తుంది. పీఎంఎస్‌బీవై కింద 18 నుంచి 70 ఏళ్ల లోపు వారికి ప్రమాద బీమా లభిస్తుంది. ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రతి ఖాతాదారుడికి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను అమలు చేస్తుండడం విశేషం.

ఎస్‌బీఐ హెల్త్ ఇన్సూరెన్స్

ఎస్‌బీఐ ప్రత్యేకంగా హెల్త్ ఇన్సూరెన్స్‌ను అమలు చేస్తోంది. నలుగురు కుటుంబ సభ్యులు యూనిట్‌గా ఆరోగ్య బీమాను పొందవచ్చని ఆయన తెలిపారు. 91 రోజుల నుంచి 45 ఏళ్లలోపు వయసున్న నలుగురు సభ్యుల కుటుంబం ఏడాదికి రూ.12 వేలు ప్రీమియం చెల్లిస్తే రూ.10 లక్షల బీమా లభిస్తుంది. ఎటువంటి వ్యాధులకైనా ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందితే బీమా వర్తిస్తుంది. నలుగురికి కలిపి రూ.10 లక్షల విలువ ఆరోగ్య బీమా పొందవచ్చని తెలిపారు. వయస్సును బట్టి ప్రీమియం పెరుగుతుంది.